## క్లుప్తంగా

### ఉచిత వైద్య శిబిరం



మందులు అందజేస్తున్న వైద్యులు, నాయకులు

**తాళ్లపూడి:** మండలంలోని పెద్దేవం గ్రామంలో ఆదివారం రాజమహేంద్రవరం మదర్ మల్టీ స్పెషాలిటీ హస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్లు బి.హిమజారెడ్డి, రేణుక, మేఘన ఈసీజీ, బీపీ షుగర్, టైఫాయిడ్, మలేరియా తదితర పరీక్షలు నిర్వహించి సుమారు 150 మంది రోగులకు మందులు పంపిణీ చేసి వైద్య సేవలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తగిరెపల్లి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ జిల్లా మాజీ ప్రచారకమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు బట్టు సుబ్బారావు, నామా ప్రకాశం, మైలవరపు రాధాకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు



గౌతమ బుద్ధుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

**నిడదవోలు (ఉండ్రాజవరం):** భాద్రపద మాసం, బుద్ధ మధుర పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని తాడిపర్రు గ్రామంలో ఉన్న బౌద్ధ ధర్మ విజయ విహార్‌లో బుద్ధుని విగ్రహం ఆదివారం ధ్యానం, ఆరాధన నిర్వహించారు. గౌతమ బుద్ధుడు, డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు బౌద్ధ గ్రంధాలైన త్రిపీటకాలు గురించి బోధించారు. బుద్ధ విహార్ వ్యవస్థాపకుడు కరుటూరి విజయచౌదరి, సొసైటీ అధ్యక్షుడు దుర్గా బాలకృష్ణ, అక్కిన గోపాలకృష్ణ, నందిన రమేష్, గారపాటి సత్యనారాయణ, అడపా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం

**నల్లజర్ల:** అనంతపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కే.వి తెలికిచెర్ల ఫీడర్ చోడవరం గ్రామంలో ఆర్.డి.ఎస్.ఎస్ లైన్ నిర్మాణం నిమిత్తం ఈ నెల 8వ తేది నుంచి 11వతేది వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తెలికిచెర్ల ఫీడర్ పరిధి చోడవరం గ్రామంలో గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

### రైల్వే అండర్ పాస్ మూసివేత

**నిడదవోలు (ఉండ్రాజవరం):** మండల కేంద్రంలోని కాల్దరి రైల్వే అండర్ పాస్ వద్ద సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతున్న కారణంగా మంగళవారం నుంచి నెల రోజులపాటు వాహన రాకపోకలు నిలిపి వేస్తున్నట్లు ఆర్అండ్‌బీ అధికారులు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రయాణికులు, వాహనదారులు, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాలని రైల్వే అధికారులు సూచించారు.

### 9న జిల్లా టెన్నీకాయిట్ పోటీలు

**దేవరపల్లి:** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్త్రీ, పురుషుల టెన్నీకాయిట్ పోటీలు ఈ నెల 9వ తేదీ మంగళవారం దేవరపల్లి మండలం రామన్నపాలెం జెడ్పీ హైస్కూ క్రీడా మైదానంలో జరుగుతున్నట్లు టెన్నీకాయిట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గద్దె చంద్రశేఖర్, ఆచంట వెంకటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఉత్సాహం ఉన్న క్రీడాకారులంతా పోటీల్లో పాల్గొనవచ్చునని వారు తెలిపారు.

### పిచ్చికుక్క స్వైర విహారం

**చాగల్లు:** మండల కేంద్రంలో పిచ్చి కుక్క స్వైర విహారం చేసి పలువురిని కరవడంతో గాయాలు పాలు అయ్యారు. ఆదివారం ఎస్సీ, బీసీ ఏరియాల్లో ఓ కుక్క తీవ్రంగా దాడి చేసి కరిచినట్లు స్థానికులు వాపోయారు. కుక్కను స్థానికులు వెంబడించి గ్రామానికి దూరంగా తరిమారు. బాధితులను స్థానిక ప్రవేటు, ప్రభుత్వ అస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కుక్కల సంచారం పై చర్యలు తీసుకొవాలని కోరుతున్నారు.

### రూ.56 వేలు పలికిన గణపతి లడ్డూ

**చాగల్లు:** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చాగల్లులో వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. వేలంలో 101 కిలోల లడ్డూను చౌటుపల్లి వీరరాఘవులు, మేనల్లుడు కాశిశెట్టి బలరామ్‌లు రూ.56 వేలకు దక్కించుకున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు గండ్రోతు సురేంద్ర కుమార్ తెలిపారు. వర్తక సంఘం వినాయకుడి గుడి వద్ద నిర్వహించిన 70 కిలోల లడ్డూని పరమేశు బయోటిక్ ఉద్యోగులు దక్కించుకున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

# సంపద లేని కేంద్రాలు

- దిష్టి బొమ్మల్లా సంపద తయారీ కేంద్రాలు
- స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ఉత్తిదే!
- గ్రామాల్లో చెత్త కుప్పలు దర్శనం
- పంచాయతీల ఆదాయానికి గండి



కేంద్రంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



నిరుపయోగంగా మారిన సంపద కేంద్రం

**చాగల్లు:** గ్రామాల పరిశుభ్రతతో పాటు ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి చెత్త సంపద కేంద్రాలను నిర్మించింది. చెత్తను వేరు చేసి ఎరువులుగా తయారు చేసి వాటి ద్వారా వచ్చే ఆదాయంతో పంచాయతీలను అభివృద్ధి చేయాల్సి ఉంది. అయితే ఈ మహోన్నత ఆశయం కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నీరుగారిపోతోంది. ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే ఆ ఒక్కరోజు మాత్రమే తూతూ మంత్రంగా కార్యక్రమాన్ని చేపట్టి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. గ్రామాల్లో చెత్త సేకరణ సైతం సక్రమంగా జరగడం లేదు. దీంతో చెత్త సేకరణ కేంద్రాలు కూడా మరుగున పడ్డాయి.

**కొరవడిన పర్యవేక్షణ**

గ్రామాల్లో ఇంటింటా వ్యర్థాలు సేకరించేందుకు హరిత రాయబారులను నియమించి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. చెత్త సంపద కేంద్రాలపై జిల్లాస్థాయి అధికారులతో పాటు డివిజన్, మండలస్థాయి అధికారుల పర్యవేక్షణ కొరవడింది. చాగల్లు మండలంలో 15 గ్రామాల్లో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన సంపద కేంద్రాలు సగంపైగా గ్రామాల్లో నిరుపయోగంగా మారాయి. ప్రతి ఊరిలో ఎక్కడ పడితే అక్కడ రహదారుల పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్తను ఎక్కడికీ



చాగల్లులో నిర్మించిన సంపద కేంద్రం

తరలించకుండా చెత్తకు నిప్పు పెట్టి చేతులు దులిపేసుకుంటున్నారు.

**అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..**

లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారడంతో గ్రామాల్లో మందు బాబులకు ఆవాసాలుగా మారాయి. గ్రామాలకు దూరంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. కొన్నిచోట్ల అధికారులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఒక్కో కేంద్రానికి సుమారు రూ.3.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటి నిర్వహణపై చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయా గ్రామాల సర్పంచులు కోరుతున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పర్యవేక్షించాలని, చెత్త నుంచి ఆదాయం పెంచుకొని ఆ మొత్తాన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**గత ప్రభుత్వంలో పక్కాగా..**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చెత్త సంపద తయారీ కేంద్రాలకు చేరిన వ్యర్థాలను తడి, పొడిగా వేరుచేసి వర్మీ కంపోస్టు ఎరవు తయారు చేసేవారు. దీన్ని కిలో రూ.10 నుంచి రూ.30 వరకు రైతులకు విక్రయించి పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకునేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక సంపద కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడి లక్ష్యం నీరుగారిపోయింది. ఇప్పటికైనా లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తే పంచాయతీలకు ఉపయోగకరంగా ఉంటుంది.

**వినియోగంలోకి తీసుకురావాలి**



చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం షెడ్లను నిర్మించింది.. అయితే ఇప్పుడు అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ప్రభుత్వం చొరవ తీసుకుని వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయిస్తే ఆదాయం సమకురుతుంది.

– ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు, బ్రాహ్మణగూడెం

### అదనపు పొగాకు కొనుగోలుకు అనుమతి



ప్రసాద్, బోర్డు రీజనల్ మేనేజరు

**దేవరపల్లి:** 2024–25 పంట సీజన్‌లో నమోదిత రైతులు ఉత్పత్తి చేసిన అధిక పొగాకు, నమోదు కాని రైతులు ఉత్పత్తి చేసిన అనధికారిక పొగాకును నమోదిత వ్యాపారులు, డీలర్లు కొనుగోలు చేయుటకు పొగాకు బోర్డు అనుమతి ఇచ్చిందని రాజమహేంద్రవరం బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. బోర్డు నిబంధనలకు లోబడి పంట కొనుగోలు చేస్తామని ఆయన వివరించారు. 2024–25 పంట కాలంలో రీజియన్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో 58 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తికి బోర్డు అనుమతించినట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటి వరకు 56 మిలియన్ల కిలోలు విక్రయాలు జరిగాయని, మరొక రెండు మిలియన్ల కిలోలు కొనుగోలు చేస్తే అనుమతించిన మేరకు పొగాకు విక్రయాలు పూర్తి కానున్నట్లు ఆయన వివరించారు.

**అపరాధ రుసుం రద్దు**

బ్యారన్‌కు 45 క్వింటాళ్లు ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇచ్చింది. ఇప్పటికే పలువురు రైతులు ఇచ్చిన కోటాను అమ్ముకుని, అదనపు పొగాకు విక్రయాల కోసం ఎదురు చూస్తున్నారు. 2023–24 పంట కాలంలో మీ సాంగ్ తుపాన్ కారణంగా వేసిన పొగాకు తోటలు దెబ్బతినడంతో అదనంగా పండించిన పొగాకుపై అపరాధ రుసుం రద్దు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధుల అభ్యర్థన మేరకు ఆ ఏడాది పెనాల్టీ లేకుండా పొగాకు కొనుగోలు చేశారు. దీంతో అపరాధ రుసుం రద్దు చేయడం వల్ల సుమారు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలో రూ.19 కోట్లు అపరాధ రుసుం రద్దు చేసినట్లు ఆయన తెలిపారు.

## అన్నదాత పోరుకు తరలిరండి!



తానేటి వనిత, మాజీ హోంమంత్రి

**దేవరపల్లి:** వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 9వ తేదీన కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాత పోరు కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, రైతులు భారీగా తరలి రావాలని మాజీ హోంమంత్రి, పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత పిలుపునిచ్చారు. నాలుగు మండలాల పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున తరలి వచ్చి రైతాంగ సమస్యలపై ప్రభుత్వానికి వినపడేలా గళం వినిపించాలని ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఖరీఫ్ పంటలకు అవసరమైన యూరియా ఎరవుతో పాటు రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని, ఎరువులను పక్కదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి అందరికి వర్తింపజేయాలని, వర్షాల కారణంగా దెబ్బ తిన్న ప్రాంతాల రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైయిందని ఆమె మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు అవసరమైన ఎరువులను ముందుగానే సొసైటీలు, ప్రవేటు డీలర్ల వద్ద సిద్ధంగా ఉంచిన సంగతిని గుర్తు చేశారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌కు వ్యతిరేకంగా అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## కూటమిలో రైతులకు గిట్టుబాటేది..?



రచ్చబండలో పాల్గొన్న గ్రామస్తులు, పార్టీ శ్రేణులు



పెద్దేవంలో కూటమి మోసాలను గ్రామస్తులకు వివరిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు

**తాళ్లపూడి:** కూటమి ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధర లేక పెట్టుబడులు కూడా రాక తల్లడిల్లుతున్నా వారిని పట్టించుకోకపోవడం దారుణమని కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని పెద్దేవంలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తలారి వెంకట్రావు, మండల నాయకులు కలిసి గ్రామంలో రచ్చబండ నిర్వహించి చంద్రబాబు ఏడాదిన్నర పాలనలోని మోసాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ చంద్రబాబు హామీలు ఇచ్చి దానిని అనంతరం విస్మరిస్తారని, ప్రజలను మోసం చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని మండిపడ్డారు. ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రైతుల వద్ద ఉన్న పంటలను కొంటామని చెప్పి ప్రభుత్వం చేతులేత్తేయడంతో ఉల్లి, టమాటా, చీనీ రైతులు నష్టపోతున్నారన్నారు. దళారులకు ప్రభుత్వం వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో అన్నదాతలకు పూర్తి భరోసా కల్పించామని, ధరలు స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి మద్దతూ ధర కల్పించినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు, రాష్ట్ర ఎస్సీ సెల్‌కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, పార్టీ పట్టణ కన్వీనర్ చిట్టూరి అన్నవరం, సర్పంచ్ తిరిగిపల్లి వెంకట్రావు, మాజీ ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, జిల్లా పార్టీ యాక్టివ్ కార్యదర్శి వంటోలు పోశిబాబు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతులందరికీ యూరియా అందిస్తాం



పశివేదలలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

**తాళ్లపూడి(కొవ్వూరు):** జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులందరికీ సరిపడా యూరియా అందిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. మండలంలోని పసివేదలలో ఆదివారం కలెక్టర్ వివిధ పంటలలో యూరియా వాడకం, సరఫరా గురించి రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా కొరతపై రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. అవసరం మేరకు మాత్రమే యూరియా పంటలకు వాడాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులని ప్రోత్సహించాలని వారు పండించే ధాన్యం రైతులు అందరూ వాడాలని కోరారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ద్వారా సహకార సంఘాలు, బ్యాంకులు రుణాలు అందించాలని బ్యాంకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్ శ్రీనివాస్ రావు, తాహసీల్దార్ దుర్గాప్రసాద్, మండల వ్యవసాయ అధికారి, పసివదల సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామచంద్ర రావు, రైతులు పాల్గొన్నారు.

## సమస్యలపై అన్నదాత పోరు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రూరల్ మండల పార్టీ నాయకులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు

**నిడదవోలు రూరల్:** రైతుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రూరల్ మండల వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు. రైతన్నకు బాసటగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 9న జరిగే 'ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు' వాల్ పోస్టర్‌ను నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు కామిశెట్టి సత్యనారాయణ, అయినీడి పల్లారావు, పెరవలి ఎంపీపీ కార్పెర్ల ప్రసాద్ మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలనే లక్ష్యంతో ఈ నెల 9న మంగళవారం ఉదయం 10 గంటలకు కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగే అన్నదాత పోరు నిరసన కార్యక్రమానికి నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల నుంచి పార్టీ శ్రేణులు, రైతులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరవల్లి సత్యనారాయణ, కస్తూరి సాగర్, సుంకల్లి శ్రీహరి, గజ్జరపు శ్రీరమేష్, మానుకొండ చంద్రబాబు, ఆర్.సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

**అన్నదాత పోరును విజయవంతం చేయాలి**

**తాళ్లపూడి:** రైతాంగ సమస్యలపై వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు నిర్వహించ తలపెట్టిన అన్నదాత పోరును విజయవంతం చేయాలని కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పేర్కొన్నారు. పెద్దేవంలో ఆదివారం పార్టీ మండల నాయకులతో కలిసి అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ 9వ తేదిన ఉదయం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసనలో భాగంగా వినతి పత్రం అందజేస్తామన్నారు. ఎరువులు బ్లాక్‌మార్కెట్‌కు తరలిపోవడంపై అన్నదాతకు బాసటగా నిర్వహిస్తున్న ఈ నిరసనకు నియోజకవర్గంలోని మూడు మండలాల నాయకలు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు, రాష్ట్ర ఎస్సీ సెల్‌కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, పార్టీ పట్టణ కన్వీనర్ చిట్టూరి అన్నవరం, సర్పంచ్ తిరిగిపల్లి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు బట్టు సుబ్బారావు, పోశిన శ్రీకృష్ణదేవరాయులు, తదితరలు పాల్గొన్నారు.

## విషసర్పాలతో సావాసం



సీబీఎన్ కాలనీలో ముళ్లపొదలతో నిండిన ఇంటి స్థలం

**దేవరపల్లి:** మండలంలోని 2000–2001 సంవత్సరంలో దేవరపల్లిలో సుమారు 315 మంది బడుగు బలహీన వర్గాలకు అప్పటి ప్రభుత్వం ఇళ్లస్థలాలు పంపిణీ చేసింది. చంద్రబాబు నాయుడు (సీబీఎన్) కాలనీగా నామకరణం చేశారు. స్థలల్లో దాదాపు 250 మంది లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేసుకుని నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పలువురు లబ్ధిదారులు స్థలాలను ఇతరులకు విక్రయించడంతో ఇద్దరు, ముగ్గురు చేతులు మారి స్థలాలు నిరూపయోగంగా మారి ముళ్లపొదలు పెరిగి పాములకు నివాసాలుగా ఉన్నాయని కాలనీ వాసులు తెలిపారు. కాలనీలో సుమారు 50 స్థలాలు నిరూపయోగంగా ఉన్నాయని, స్థలాల యజమానులు ఎవరో తెలియడంలేదని చీకటి పడితే బిక్కుబిక్కుమంటూ ఉంటున్నామని ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఏదీ..గోదారి



కొవ్వూరు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద భారీగా నిలిచిన ట్రాఫిక్

**తాళ్లపూడి(కొవ్వూరు):** ఇసుక స్టాక్ పాయింట్ వద్దకు వచ్చిన లారీలతో ఏటిగట్టు రోడ్డుపై ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని గామన్ బ్రిడ్జి, ఆరికిరేవుల, కుమారదేవం ఏటిగట్టుకు అనుకుని ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఇటీవల కొవ్వూరు గామన్ బ్రిడ్జి సమీపంలోని ఇసుక స్టాక్ పాయింట్ వద్ద రెండు గంటలకు పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పెద్ద సంఖ్యలో లారీలను రోడ్డుపై నిలపడంతో ట్రాఫిక్ పూర్తిగా స్థంభిస్తుంది. దింతో ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహన దారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాహనాలు కదపడానికి కూడా అవకాశం లేకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని, ఉన్నతాధికారులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని కోరుతున్నారు.

### గంగమ్మ ఒడిలోకి భారీ గణనాథుడు



ఓవర్ బ్రిడ్జిపై నుంచి విగ్రహన్ని నిమజ్జనం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

**నిడదవోలు:** పట్టణంలోని గణేష్ చౌక్ సెంటర్‌లో వేంచేసియున్న పూజా గణపతి, కుమారస్వామి ఆలయం వద్ద 103 వార్షికోత్సవ గణపతి నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 18 అడుగుల భారీ గణనాథుని విగ్రహా నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడిలోకి చేరాడు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలు, డీజే హోరు, యువకుల నృత్యాల నడుమ నిడదవోలు ఓవర్ బ్రిడ్జి పైనుంచి భారీ క్రేన్ల సహాయంతో పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలోకి భారీ గణనాథుని విగ్రహన్ని నిమజ్జనం చేశారు. సంపూర్ణమైన నిమజ్జనాన్ని కనులారా వీక్షించిన భక్తులు గొప్ప అదృష్టంగా భావించారు. సీఐ తిలక్, ఎస్సై జగన్‌మోహనరావు, పట్టణ జనసేన అధ్యక్షుడు రంగా రమేష్, విగ్రహ దాత ఉప్పులూరి వీరభద్ర రావు, కౌన్సిలర్ నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.